సాక్షి
కర్నూలు
శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



మంత్రాలయంలో లారెన్స్

మంత్రాలయం: సినీ నటుడు రాఘవ లారెన్స్ గురువారం రాత్రి మంత్రాలయం వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి మంచాలమ్మకు హారతులు పట్టారు. రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు.



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళా వేదికపై రాజమండ్రి కళాకారుల కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.88
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:101.304
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 24,776
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:24,237

న్యూస్‌రీల్

లోకాయుక్త జస్టిస్‌ను కలిసిన ఎస్పీ



జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డికి పూలమొక్కను అందిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు: ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్ రెడ్డిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం స్థానిక సంతోష్ నగర్‌లోని లోకాయుక్త కార్యాలయానికి వెళ్లిన ఎస్పీ జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డికి పూలమొక్కను అందించారు.

ఆఫ్‌లైన్‌లోనే ఇసుక బుకింగ్



ఇసుకను బుకింగ్ కేంద్రం వద్ద గుమికూడిన వాహనదారులు

సి.బెళగల్: ఇసుక బుకింగ్ ప్రక్రియ గురువారం కూడా ఆఫ్‌లైన్‌లోనే కొనసాగింది. సి.బెళగల్‌లోని గ్రామ సచివాలయం– 2లో ఏర్పాటు చేసిన కేంద్రానికి జనాలు, వాహనదారులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అవస్థలు ఎదుర్కొన్నారు. గురువారం 55 టిప్పర్లు, 50 ట్రాక్టర్లకు 1,325 టన్నుల ఇసుకను బుక్ చేసినట్లు వీఆర్వో రఫీ తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

- ఏపీ మహిళా చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(న్యూసిటీ): ప్రతి మహిళా ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఏపీ మహిళా చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అన్నారు. కర్నూలు సునయన ఆడిటోరియంలో పోషకాహార వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, చిన్నపిల్లలను పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం 2014లో పౌష్టికాహార వారోత్సవాల కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. వివక్షతను, వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. జేసీ నవ్య మాట్లాడుతూ... కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు సీడీపీఓల పరిధిలో బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించా రు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషన్ కార్యదర్శి వసంతబాల, చైల్డ్‌వెల్ఫేర్ చైర్మన్ జుబేదాబేగం, ఐసీడీఎస్ ఆర్జేడీ రోహిణి, పీడీ వెంకటలక్ష్మమ్మ జిల్లా లీగల్ సెల్ అధికారి సులోచన తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు 'చంద్ర' గ్రహణం



ప్రజలకు మంచి చేయాలనే సంకల్పం కూటమి ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించడం లేదు. ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ఆపివేయడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కరువు ప్రాంతమైన ఆదోని అభివృద్ధికి మెడికల్ కాలేజీని మంజూరు చేసి, వైద్యులను కూడా నియమించింది. ఈ ఏడాది కాలేజీ ప్రారంభం కావాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం అడ్డుకుంది. వైద్య కాలేజీని ప్రైవేటుకు అప్పగించేందుకు యత్నాలు సాగుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పూర్తయ్యే దశలో నిలిచిపోయిన మెడికల్ కళాశాల భవనం

- ఆదోనిలో మెడికల్ కాలేజీ నిర్మాణం ఆపిన ప్రభుత్వం
- ఇప్పటికే 80 శాతం నిర్మాణం పూర్తి
- నిర్మాణం పూర్తి చేయలేక చేతులెత్తేసిన సర్కార్
- ప్రైవేట్‌కు అప్పగించేందుకు రంగం సిద్ధం
- రూ.500 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించిన గత ప్రభుత్వం
- నిర్మాణం పూర్తయ్యుంటే ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభం
- సీట్లు సైతం రాకుండా అడ్డుకున్న కూటమి ప్రభుత్వం



ఆదోనిలో అర్ధంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

కర్నూలు(హాస్పిటల్): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి... ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఎంత తేడా ఉంది. గత ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తే.. ప్రస్తుత ప్రభుత్వం ఉన్న వనరులను ప్రజలకు దూరం చేసే విధంగా పాలన సాగిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలను ప్రారంభించింది. ఆదోని పార్లమెంట్ నియోజకవర్గం కాకున్నా.. కరువు ప్రాంతం కావడంతో ఇక్కడ కాలేజీ నిర్మాణానికి రూ.500కోట్ల వరకు కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు కాలేజీల నిర్మాణాలు పూర్తి కావడంతో పాటు ఒక్కో దాంట్లో 150 ఎంబీబీఎస్ సీట్లతో గత సంవత్సరం ప్రారంభమయ్యాయి.మిగిలిన కాలేజీల నిర్మాణం కూడా దాదాపుగా పూర్తి కావచ్చింది. ఇందులో ఆదోని మెడికల్ కాలేజీ కూడా ఉంది. ప్రస్తుతం దీని నిర్మాణం 80 శాతం వరకు పూర్తయ్యింది. మరో 20 శాతం శరవేగంగా పూర్తిచేసి ఉంటే ఈ యేడాది నుంచే 150 సీట్లతో కళాశాల ప్రారంభమయ్యేది. ఈ ప్రాంత వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు రోగులకు అందుబాటులోకి వచ్చేది.

కాలేజీ నిర్మాణాలను ఆపేయండి

ఆదోనిలో నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ దాదాపు 80 శాతం పూర్తయ్యింది. గత ఆరు నెలలుగా దీని నిర్మాణాన్ని టీడీపీ అడ్డుకుంటూ వస్తోంది. ఎన్నికల సమయంలో నిధుల విడుదల కాకుండా అడ్డుకుంది. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఏకంగా కళాశాల నిర్మాణానికే బ్రేకులు వేసింది. వెంటనే నిర్మాణాన్ని ఆపేయాలంటే ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులచే ఉత్తర్వులు జారీ చేయించింది. ఈ క్రమంలో ఈ కళాశాల నిర్మాణాన్ని అధికారులు ఆపేశారు.

ఇప్పటికే వైద్య సిబ్బంది ఏర్పాటు

ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఈ యేడాది నుంచే ప్రారంభించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం అవసరమైన అధికారులు, ఆయా విభాగాల స్పెషాలిటీ వైద్యులను ఎన్ఎంసీ నిబంధనల మేరకు నియమించింది. ఆసక్తి ఉన్న వైద్యులను అక్కడికి పంపించి ఆ ప్రాంత రోగులకు అందుబాటులో ఉంచింది. వైద్యులు ప్రస్తుతం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండి అక్కడి రోగులకు చికిత్స అందిస్తున్నారు. మరోవైపు అవసరమైన నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగులను నియమించేందుకు గత డిసెంబర్‌లో నోటిఫికేషన్ కూడా ఇచ్చింది.. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఈ నోటిఫికేషన్‌కు కూడా బ్రేకులు వేసింది. ప్రభుత్వం చెప్పేంత వరకు ఎలాంటి నియామకాలు చేపట్టకూడదని ఆదేశాలు జారీ చేసింది.

ప్రైవేటుకు అప్పగించేందుకు ఏర్పాట్లు

ఆదోని ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) పద్ధతిలో దీనిని ఇచ్చేందుకు దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సినీ రంగానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన కార్పొరేట్ ఆసుపత్రికి దీనిని ఇచ్చేందుకు పెద్దలు ఒప్పందాలు కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలో అప్పగింతలు పూర్తి కానున్నట్లు సమాచారం. ఇదే జరిగితే పూర్తి ఉచితంగా జరగాల్సిన వైద్యం నిర్ణీత ఫీజులతో అందే అవకాశం ఉంది. వైద్యసీట్లు సైతం యాజమాన్య కోటా కింద విక్రయించుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మెడికల్ కాలేజీతో ఇవీ ప్రయోజనాలు..

జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆదోని డివిజన్‌లోని హొళగుంద, కోసిగి, కౌతాళం, హాలహర్వి తదితర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రమైన కర్నూలుకు రావాలంటే మూడు గంటల సమయంపైనే పడుతుంది. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే కర్నూలు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలంటే వారి ప్రయాణానికే ఆరేడు గంటలు సమయం పడుతుంది. కొన్ని ప్రాంతాలకు సాయంత్రమైతే బస్సులుండవు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదోనిలో మెడికల్ కాలేజీ వస్తే ఆయా ప్రాంతాల ప్రజలందరికీ ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. అక్కడి జనరల్ హాస్పిటల్‌లో కర్నూలులో మాదిరిగానే వైద్యం అందుకుని త్వరగా ఇళ్లకు చేరుకునే అవకాశం లభిస్తుంది. మెడికల్ కాలేజీ వస్తే వెనుకబడిన ఆ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది.

ప్రభుత్వమే నిర్వహించాలి



నేను 10 వతరగతి వరకు పెరవలి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాను. ఇంటర్ శ్రీచైతన్య కాలేజీలో చదివి కోచింగ్ కూడా అదే కాలేజీ తీసుకొని 720 మార్కులకు గాను 587 మార్కులు సాధించాను. స్టేట్ ర్యాంకు 2844 వచ్చింది. ప్రభుత్వం వైద్యకళాశాల సీట్లు తగ్గిస్తే నష్టపోయేది మేమే కదా. ప్రభుత్వ కాలేజీలో సీటు వస్తే బాగుంటుంది.మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహిస్తే మాలాంటి విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది.

– మధుమిత, పెరవలి, మద్దికెర మండలం

ప్రైవేటుకు ఇవ్వొద్దు



ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరమైతే మెడికల్ సీట్లు ఎక్కువగా మేనేజ్ మెంట్ కోటాలో చేరతాయి. దీని వల్ల పేదలకు, మెరిట్ విద్యార్థులకు వైద్యవిద్య భారంగా మారుతుంది. ప్రైవేటీకరణ చేస్తే ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వ కాలేజీలు అయితే పెద్దగా ఉంటాయి. రోగులు ఎక్కువ మంది వస్తారు. విద్యను బాగా చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రైవేటులో దీనికి భిన్నంగా పరిస్థితి ఉంటుంది. ప్రైవేటు వారు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తారు. మేనేజ్‌మెంట్ కోటాలో వారు ఎంత చెబితే సీటుకు అంత చెల్లించాల్సి వస్తుంది.

–సి. శ్రీనివాసులు, పేరెంట్, కర్నూలు

పేద విద్యార్థులు నష్టపోతారు



నేను కర్నూలులోని ఒక అకాడమీలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. నా కూతురు ఇటీవల నీట్ పరీక్ష రాసింది. ఎస్సీ కోటాలో గతంలో 451 మార్కులకు ఎంబీబీఎస్ సీటు వచ్చేది. ఈసారి ప్రశ్నపత్రం ఈజీగా ఉందంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 500 మార్కులు వస్తే తప్ప ఎస్సీలకు సీటు వచ్చే పరిస్థితి ఉండదు. కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే భవిష్యత్‌లో 520 నుంచి 530 మార్కులు వచ్చినా సీటు వచ్చే పరిస్థితి ఉండదు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం సరి కాదు. దీనివల్ల పేద మెరిట్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు.

–బి. సుంకన్న, కర్నూలు

పంట నష్టం స్వల్పమేనట!

- రూ.1.04 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదిక

కర్నూలు(అగ్రికల్చర్): అధిక వర్షాలతో జరిగిన పంట నష్టం స్వల్పమేనని వ్యవసాయ శాఖ తేల్చింది. ఆగస్టు నెల రెండో వారం నుంచి కొద్ది రోజుల క్రితం వరకు కురిసిన వర్షాలకు వ్యవసాయ పంటలు 5,300 హెక్టార్లలో, ఉద్యాన పంటలు 823 హెక్టార్లలో నీటమునిగినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రాథమికంగా నిర్ధారించాయి. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ ఆమోదంతో ప్రభుత్వానికి, విపత్తుల నిర్వహణ శాఖకు నివేదిక సమర్పించారు. ఇన్‌పుట్ సబ్సిడీ రూ.1.04 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రాథమిక అంచనాలతో పోలిస్తే పంట నష్టాన్ని పూర్తిగా తగ్గించడం గమనార్హం. వ్యవసాయ పంటలు 626.21 హెక్టార్లలోనే దెబ్బతిన్నాయని, 1,318 మంది రైతులు నష్టపోయారని అధికారులు నిర్ధారణకు వచ్చారు. వ్యవసాయ అధికారులు, వీఏఏలు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే మమ అనిపించినట్లు తెలుస్తోంది. ఇక ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పటికి విడుదలవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

ఆదేశాలున్నాయి.. ఆటంకం కల్పించొద్దు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి


కర్నూలు(టౌన్): న్యాయ స్థానం ఇచ్చిన ఆదేశాలు ఉన్నాయని, పార్టీ కార్యాలయ నిర్మాణానికి ఆటంకం కల్పించవద్దని మున్సిపల్ అధికారులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి సూచించారు. కర్నూలు నగరపాలక కార్యాలయంలో కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేనేజర్ చిన్నరాముడిని కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినందున కర్నూలులోని ఐదు రోడ్ల కూడలిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయ నిర్మాణ పనులు కొనసాగిస్తున్నట్లు ఎస్వీ మోహన్‌రెడ్డి తెలిపారు.న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్మాణ పనులకు ఆటంకం కల్పిస్తే పార్టీ పరంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. న్యాయస్థాన తీర్పు ప్రతులను ఈ సందర్భంగా మేనేజర్‌కు ఎస్వీ మోహన్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.



నగరపాలక కార్యాలయ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు

పెత్తనం నీదా.. నాదా!

- టీడీపీలో అంతర్గత పోరు
- ఆలూరు నియోజకవర్గంలో విభేదాలు
- దేవరగట్టు హుండీ లెక్కింపుతో బహిర్గతం
- గుమ్మనూరుపై మండిపడుతున్న వీరభద్రగౌడ్



సాక్షి టాస్క్‌ఫోర్స్: గుంతకల్లు ఎమ్మెల్యేనైనా ఆలూరులోనే ఉంటా.. ఇక్కడే రాజకీయాలు చేస్తా.. పెత్తనం చెలాయిస్తానంటున్నట్లుంది గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తీరు. ఇది ఆలూరు నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న వీరభద్రగౌడ్‌తో పాటు టీడీపీ నాయకులు, శ్రేణులకు మింగుడు పడటం లేదు. ఆలూరు నియోజకర్గంలోని ప్రతి విషయంలో గుమ్మనూరు సోదరులు జోక్యం చేసుకోవడం, ఇక్కడ తమ పెత్తనమే సాగాలంటూ బహిరంగంగానే చెబుతుండటంతో టీడీపీలో వర్గ విభేదాలు తారాస్థాకి చేరాయి. తాజాగా దేవరగట్టు ఆలయం హుండీ లెక్కింపుతో మరోసారి వివాదం రచ్చకెక్కింది. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులను రద్దు చేసినప్పటికీ అంతకు ముందు గట్టు చైర్మన్‌గా ఉన్న శ్రీనివాసులు బుధవారం తన సోదరుడు గుంతకల్లు ఎమ్మెల్యే జయరాంతో కలసి దేవరగట్టుకు వెళ్లి హుండీ లెక్కించారు. దేవరగట్టు ఆలయ నిర్వహణ అంతా తామే చూసుకుంటామని, అక్టోబర్‌లో నిర్వహించే బన్నీ ఉత్సవాలు తమ ఆధీనంలో జరుగుతాయని గుమ్మనూరు సోదరులు చెప్పడంతో మరో వివాదానికి కారణమైంది. 2024 సాధారణ ఎన్నికల్లో గుమ్మనూరుకు అనంతపురం జిల్లా గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యేగా అవకాశం రావడంతో ఆయన అక్కడ పోటీ చేసి గెలుపొందారు. ఆలూరు టీడీపీ ఎమెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన వీరభద్ర గౌడ్ ప్రస్తుతం ఆలూరులో టీడీపీకి అంతా ఆయనే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. గత నెల ఆయన సమక్షంలోనే దేవరగట్టులో టెంకాయల వేలం, పార్కింగ్ వేలాలు సైతం జరిగాయి. అయినా గుమ్మనూరు జయరాం తన సోదరునితో దేవరగట్టు ఆలయానికి రావడం వీరభద్రగౌడ్ వర్గానికి ఆగ్రహం తెప్పించింది. పార్టీ అధిష్టానం ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఎవరిని ప్రకటించలేదని, అధిష్టానం ఎవరి పేరు ప్రకటించినా వారికే దేవరగట్టు పగ్గాలు అప్పగిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు మీడియా సమక్షంలో చెప్పడంతో వివాదం ముదిరింది. టీడీపీ వ్యవహారాలన్నీ తానే చూసుకుంటున్నప్పటికీ తన నియోజకవర్గంలో వారి పెత్తనమేమంటూ వీరభద్రగౌడ్ ప్రశ్నిస్తున్నారు. గుమ్మనూరు జయరాం గుంతకల్లు ఎమ్మెల్యేగా అక్కడి వ్యవహారాలు చూసుకోకుండా ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలు చేయడం.. అన్నింట్లో జోక్యం చేసుకుంటూ పెత్తనం చేయ డం వీరభద్రగౌడ్‌తో పాటు కొందరు టీడీపీ నాయకులు ఆగ్రహంతో ఉన్నా రు. ఇలాగే కొనసాగితే అధిష్టానానికి ఫిర్యాదు చేయాలని చర్చించుకుంటున్నట్లు పలువురు టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు నియోజకవర్గంలో వర్గ విభేదాలను పెంచుతున్నారని కొందరు టీడీపీ నాయకులు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా అక్టోబర్ 12న నియోజకవర్గంలోని హొళగుంద మండలం దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాలు జరగనున్నాయి. బన్ని ఉత్సవాల నిర్వహణ ఎవరు చూసుకుంటారనే ప్రశ్నలు తలెత్తుతుండటం గమనార్హం.

దేవునికే రక్షణ లేకుండా పోతోంది

దేవరగట్టు ఆలయ చైర్మన్ విషయంలో రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదు. దైవకార్యానికి రాజకీయం జోడించడం మంచిది కాదు. టీడీపీలో రెండు వర్గాలకు పడటం లేదు. ఒకరి తెలియకుండా ఒకరు హుండీలను ఎత్తుకుపోతున్నారు. భక్తులు సమర్పించిన కానుకలను దోచుకుంటున్నారు. వీరి వ్యవహారం చూస్తే దేవునికే రక్షణ లేకుండా పోతున్నట్లుంది. గుమ్మనూరు సోదరులు ఐదేళ్లు చైర్మన్‌గా ఉండి దోచుకుతిన్నది విడిచి పెట్టలేక , వారికే చైర్మన్ పదవి ఉందని చెప్పుకుంటున్నారు. మళ్లీ ఇప్పుడు దోచుకోవడం మొదలు పెట్టారు. గుంతకల్లు ఎమ్మెల్యేకు ఇక్కడే ఏం పని ఉంటుంది. దేవాలయాల దగ్గర రాజకీయాలు చేయడమేంటి? గుమ్మనూరు సోదరులు ఇక్కడ రాజకీయాలు, రౌడీయిజం మానుకోవాలి. భక్తులకు, నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బన్ని ఉత్సవాలు నిర్వహించాలి. దేవరగట్టు ఆలయ కమిటీ అనేది ఒక స్వయం ప్రతిపత్తి. అధికారులు, రాజకీయ నాయకులు దీనికి రాజకీయ రంగు పూయడం మంచిది కాదు. జిల్లా కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకొని దేవరగట్టు సమస్యను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలి. పండుగ ప్రశాంతంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలి.

– ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి

కొలిమిగుండ్ల: చింతలాయిపల్లెలో గురువారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన వల్లెపు ప్రసాద్ కుటుంబీకులు వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారంతా టీడీపీలో కొనసాగుతుండగా ప్రసాద్ కుటుంబీకులు మాత్రం వైఎస్సార్‌సీపీలో ఉంటున్నారు. పని నిమిత్తం బయటకు వచ్చిన ప్రసాద్ బస్టాండ్ పరిసరాల్లో ఉండగా టీడీపీకి చెందిన పది మందికి పైగా అక్కడికి చేరుకొని అతనిపై దాడికి దిగారు. విషయం తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు పెద్దిరాజు, ప్రకాష్, సావిత్రి సంఘటన స్థలానికి చేరుకోవడంతో వారిపై దాడికి దిగారు. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

19 నుంచి హైదరాబాద్ - తిరుమల ప్యాకేజీ టూర్

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి కర్నూలు మీదుగా తిరుమల ప్యాకేజీ టూర్ ఈనెల 19న ప్రారంభమవుతుందని ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ చంద్రమౌళీశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరం వెంకటరమణ కాలనీలోని హరిత హోటల్‌లో పికప్ పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. ఓల్వో ఏసీ స్లీపర్ బస్ హైదరాబాద్ నుంచి కర్నూలు మీదుగా ప్రతి రోజూ నడుపుతామన్నారు. పర్యాటకులకు తిరుమల తిరుపతి దేవస్థాన దర్శనం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ దర్శనంతో పాటు భోజనం, ఫ్రెషప్ తదితర సదుపాయాలు కల్పిస్తామన్నారు. కర్నూలు నుంచి ప్రతి రోజు రాత్రి 11 గంటలకు ప్యాకేజీ టూర్ బస్ బయలుదేరుతుందన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.3,930, పిల్లలకు (4 నుంచి 10 సంవత్సరాలు) రూ.3,630 ఉంటుందన్నారు. వివరాలకు 90101 77055ను సంప్రదించాలన్నారు.

26న సాంస్కృతిక పోటీలు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక బి.క్యాంపులోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26వ తేదీన జిల్లా స్థాయి యువజనోత్సవం/సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు సెట్కూరు సీఈఓ దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 - 29 సంవత్సరాలలోపు యువ కళాకారులు పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో భాగంగా ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జానపద నృత్యాలు (గ్రూప్, సోలో), జానపద గీతం (గ్రూపు, సోలో), పద్యాలు, కథారచన, చిత్రలేఖనం, వక్తృత్వం తదితర అంశాల్లో యువ కృతి కింద హ్యాండీక్రాఫ్ట్స్, టెక్స్‌టైల్స్, ఆగ్రో ప్రొడక్ట్స్ నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, అందజేస్తారన్నారు. కళాకారులు https://bit.ly/knldy24 వెబ్‌లింక్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. లేదా ఈ నెల 26న ఉదయం 9 గంటల్లోపు ప్రత్యక్షంగా నమోదు చేసుకోవచ్చన్నారు.

వర్షం ముంచి.. ధర వెక్కిరించి!

ఉల్లి రైతును వరుస వర్షాలు ఉక్కిరిబిక్కిరి చేస్తే.. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు సిండికేట్‌గా మారి నిండా ముంచేస్తున్నారు. ఇప్పటికే దిగుబడి సరిగా రాక, పండిన పంట వర్షంలో తడిసి పీకల్లోతు కష్టాల్లో ఉన్న రైతులపై వ్యాపారులు కనీస కనికరం చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. దేశం మొత్తం ఉల్లికి డిమాండ్ ఉన్నా.. ఇక్కడ మాత్రం ధర నేలచూపు చూడటాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. మార్కెట్‌కు దిగుబడులు పోటెత్తుతున్నా.. ధర విషయంలో చుక్కెదురవుతోంది. పంట పండించటం ఒక ఎత్తయితే, అమ్ముకోవడం మరో ఎత్తుగా మారింది. రైతులను కళ్లెదుటే దగా చేస్తున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


తడిసిన ఉల్లిగడ్డలను మార్కెట్‌లోనే ఆరబోసిన దృశ్యం


కుళ్లిపోయిన ఉల్లి దిగుబడులు


కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ఉల్లి దిగుబడులు


దిగుబడుల పైనే సేదతీరిన రైతు

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటా ఉల్లి ధర ఇలా.. (రూ॥ల్లో)

తేదీ	కనిష్టం	గరిష్టం
3వ తేదీ	రూ. 1,621	రూ. 3,919
4వ తేదీ	రూ. 1,237	రూ. 3,919
5వ తేదీ	రూ. 1,067	రూ. 3,369
6వ తేదీ	రూ. 719	రూ. 3,819
9వ తేదీ	రూ. 512	రూ. 3,419
11వ తేదీ	రూ. 307	రూ. 3,613
12వ తేదీ	రూ. 309	రూ. 3,689
13వ తేదీ	రూ. 301	రూ. 3,669

కాటేసిన కరెంట్

● వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


మృతుడు దాసరి అర్జున్ (ఫైల్)

హాలహర్వి: ఉమ్మడి కర్నూలులో జిల్లాలో గురువారం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుదాఘాతంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మిద్దెపై ఆడుకుంటూ ఓ బాలుడు, పాణ్యం మండలం తొగర్చేడు వద్ద పొలానికి నీళ్లు కట్టేందుకు వెళ్లి ఓ రైతు కరెంట్‌కు బలయ్యారు. హాలహర్వి మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన వెంకటేష్‌కు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు దాసరి అర్జున్ (17) గురువారం ఇంటి మిద్దెపై గడ్డి వేసేందుకు వెళ్లాడు. కాగా పైన ఉన్న 11 కేవీ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తల్లిదండ్రులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం కర్ణాటక రాష్ట్రం బళ్లారి ఓపీడీ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే దాసరి అర్జున్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని తండ్రి వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్ర తెలిపారు.

పొలానికి నీరు కట్టేందుకు వెళ్లి..

బొమ్మలసత్రం/పాణ్యం: నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన బలరాముడు (61) గురువారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పాణ్యం మండలం పరిధిలోని తొగర్చేడు గ్రామ సమీపంలో వరి సాగు చేస్తున్నాడు. గురువారం పొలానికి నీరు కట్టేందుకు వెళ్లి వ్యవసాయ మోటర్ స్టార్టర్‌ను ఆన్ చేయబోయాడు. అయితే అప్పటికే స్టార్టర్‌కు విద్యుత్ ప్రసారం కావడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారకస్థితిలో పడిపోయాడు. అక్కడే ఉన్న కూలీలు 108లో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బలరాముడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య తిరుపాలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.


రైతు బలరాముడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

మంత్రాలయంలో జల ప్రసాదం కౌంటర్లు


జల ప్రసాదం కౌంటర్‌ను ప్రారంభిస్తున్న సుభుదేంద్రతీర్థులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో శుద్ధజల ప్రసాదం కౌంటర్లను గురువారం మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు ప్రారంభించారు. స్థానిక విజయేంద్ర వసతి గృహం, బృందావన గార్డెన్, అన్నపూర్ణ భోజనశాలతో మూడు కొత్త శుద్ధ జల ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. దివి ల్యాబోరేటరీస్ సంస్థ ప్రతినిధులు నాగేష్, శ్రీనివాస్ సహకారంతో కౌంటర్లు నెలకొల్పారు. స్వామిజీ చేతుల మీ దుగా వేద మంత్రోచ్ఛారణ మధ్య శాస్త్రోక్తంగా వీటి ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ శ్రీమఠానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఈ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. క్షేత్రంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దాతలను ఈ సందర్భంగా పీఠాధిపతి శేషవస్త్రం, రాఘవేంద్రుల జ్ఞాపిక, పరిమళ ప్రసాదం, మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు

ధిక్కార సీఐపై బదిలీ వేటు!

కర్నూలు: గణేష్ నిమజ్జన వేడుకల్లో ఉన్నతాధికారుల సమాచారం లేకుండా సొంతంగా వ్యవహరించాడనే కారణంతో కర్నూలు సబ్ డివిజన్‌లోని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు పడింది. సర్కిల్ పరిధిలో మూడు రోజులకే నిమజ్జన వేడుకలు జరిపించాల్సి ఉండగా, ఉన్నతాధికారులకు తెలియకుండా ఐదు రోజులకు అనుమతి ఇవ్వడంతో ఎస్పీ బిందుమాధవ్‌కు సమాచారం చేరింది. తనకు సమాచారం ఇవ్వకుండా ఐదు రోజులు ఎలా అనుమతి ఇస్తావంటూ ఎస్పీ ప్రశ్నించడంతో.. సరైన సమాధానం చెప్పనట్లు తెలిసింది. ఇదే సమయంలో తాను సెలవుపై వెళ్తానని చెప్పగా.. అలా కుదరదని, నిమజ్జన వేడుకల వరకు విధుల్లో ఉండాల్సిందేనని ఎస్పీ ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే సర్కిల్ బాధ్యతలను తప్పించి ఆదోని సబ్ డివిజన్‌లోని లూప్‌లైన్ విభాగానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇదే సమయంలో చార్జ్‌మెమో జారీ చేసినట్లు తెలిసింది. అయితే ఇన్‌స్పెక్టర్‌కు ఆ శాఖ ఉన్నతాధికారులతో పాటు రాజకీయంగా కూడా పలుకుబడి ఉండడంతో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులతో ఉన్నతాధికారిపై ఒత్తిడి చేయించి అదే సర్కిల్‌లో కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. నెల రోజుల క్రితం జరిగిన బదిలీల్లో రాజకీయ అండదండలతో కోరుకున్న చోటు దక్కించుకున్న ఈ సీఐ, ఇంతలోనే ఉన్నతాధికారినే ధిక్కరించగా బదిలీ వేటు పడటం గమనార్హం. ఇదిలాఉంటే ఈ విషయం చినబాబు దృష్టికి కూడా వెళ్లినట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆరోగ్యశ్రీకి నగదు వసూలు చేస్తే చర్యలు


సమావేశంలో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(హాస్పిటల్): ఎన్‌టిఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ) పథకం కింద రోగుల నుంచి నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆసుపత్రి యాజమాన్యాలను హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆరోగ్యశ్రీ చికిత్సల కోసం ఆసుపత్రి యాజమాన్యాలు నగదు తీసుకున్నారనే వివరాలను ఫిర్యాదు రూపంలో రోగుల నుంచి ఏ విధంగా తీసుకుంటారని జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులపై వస్తున్న ఫిర్యాదులకు సంబంధించి డీఎంహెచ్‌వో, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ నెలలో ఒకసారి సబ్ కమిటీ స్థాయి సమావేశం నిర్వహించి వివరణ తీసుకోవాలని, సంతృప్తి చెందకపోతే ప్రతి మూడు నెలలకోసారి జరిగే జిల్లా స్థాయి కమిటీలో ఫిర్యాదును పరిశీలించాలన్నారు. జిల్లాలో వివిధ ఆసుపత్రులకు సంబంధించి ఇప్పటి వరకు 174 ఫిర్యాదులు రాగా అందులో 134 వరకు నగదును రోగులకు ఆసుపత్రి యాజమాన్యాలు తిరిగి చెల్లించారన్నారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎంబీఎస్‌ఎస్‌వీ. భాస్కరరెడ్డి, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్, ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుందూనదిలో ఇద్దరు గల్లంతు

● అనారోగ్యంతో ఒకరు, మద్యం మత్తులో మరొకరు కుందూలో దూకిన వైనం
● గల్లంతైన వారి కోసం గాలింపు

కోవెలకుంట్ల: కలుగొట్ల గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న కుందూనదిలో గురువారం ఇద్దరు వ్యక్తులు గల్లంతయారు. స్థానికులు అందించిన సమచారం మేరకు.. గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి(64) అనే వృద్ధుడు కొంత కాలం నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి నయం కాకపోవడంతో ఎలాగు బతకనని భావించి జీవితంపై విరక్తి చెంది గురువారం తెల్లవారు జామున తాను చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. గ్రామ శివారులో ప్రవహిస్తున్న కుందూనదిలో దూకినట్లు అటుగా వెళుతున్న రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన బాలగుర్రప్ప(42) అనే వ్యక్తి గ్రామంలో జరిగే ఓ వర్ధంతి కార్యక్రమంలో అతిగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో కుందూనది వద్దకు వెళ్లి వంతెన పైనుంచి నదిలోకి దూకి గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ భూపాలుడు తమ సిబ్బందితో గల్లంతైన వారి ఆచూకీ కోసం నది వెంట గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కుందూనదిలో గల్లంతు కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ఇద్దరు ఆకతాయిలకు గురువారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన పిచుక శివశంకర్, నందవ రం శివశంకర్ వరప్రసాద్‌లు స్థానిక ఆత్మకూరు బస్టాండ్ వద్ద మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వనటౌన్ పోలీసులను ఆకతాయిలపై కేసు నమోదు చేశారు. ఇద్దరు నిందితులకు జడ్జి ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

అంకితభావంతో పని చేయాలి


డీఎస్పీ సంతోష్‌ను సన్మానిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా


బొమ్మలసత్రం: పోలీసు శాఖలో అంకితభావంతో పని చేసి గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా అన్నారు. స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీగా పని చేస్తూ పదోన్నతిపై పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా బదిలీ అయిన సంతోష్‌కు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంతోష్ రెండేళ్లపాటు నంద్యాల జిల్లా ఎస్‌బీ డీఎస్పీగా సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. భవిష్యత్‌లో ఆయన పోలీస్ శాఖలో అత్యున్నత పదవులు పొందాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీలు యుగంధర్‌బాబు, రవికుమార్, రామాంజినాయక్, శ్రీనివాసులు సీఐలు సూర్యమౌళి, ఎరిషావలి, ఇస్మాయిల్, మోహన్‌రెడ్డి, మల్లికార్జునగుప్తా, వెంకటేశ్వరరావు, ప్రియతమ్‌రెడ్డి, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


మృతుడు వైష్ణవ్ వెంకటేశ్

ఆదోని సెంట్రల్: మదిరె గ్రామానికి చెందిన వైష్ణవ్ వెంకటేశ్ (25) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదోని-ఇస్వీ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలపై గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే ఎస్‌ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సర్వేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహంపై చొక్కాకు ఉన్న టైలర్ లేబుల్ వివరాల మేరకు మృతుడు మదిరె గ్రామానికి చెందిన వైష్ణవ్ వెంకటేశ్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఇతను మెడికల్ ఏజెన్సీలో సేల్స్‌మెన్‌గా పని చేస్తూ రెండు నెలలు క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో గురువారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): పొదుపు గ్రూపు మహిళలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని డీఆర్‌డీఏ సెర్ప్ సమావేశ భవనంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మార్తమ్మ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పీఎంఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుస్థిరమైన జీవనోపాధిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ముఖ్యంగా బ్యాంకు లింకేజీ, ఉన్నతి, స్త్రీనిధి, లక్‌పత్ దీదీలను గుర్తించి ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దేగలయ్య, డీపీఎం దానం, ఏరియా కో ఆర్డినేటర్లు ఎల్లయ్య, శ్రీనివాసు లు, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మాధవరం చెక్ పోస్ట్ దగ్గర రాయచూర్ వైపు నుంచి వస్తున్న జైలో వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో 2,880 మద్యం టెట్రా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న పెద్దకడుబూరు మండలం నాగలాపురానికి చెందిన చాకలి గంగాధర్, మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి తండాకు చెందిన సుగాలి రమేష్‌నాయక్‌ను అరెస్ట్ చేశారు. వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన మద్యం విలువ రూ. 4 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నా.. తరలిస్తున్నా.. తన సెల్ 9440902579కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీలో చెక్‌పోస్ట్ ఇన్‌చార్జ్ ఈఎస్‌ఐ సత్యనారాయణ, హెచ్‌సీలు లింగప్రసాద్, సెబ్ కానిస్టేబుళ్లు భరత్, నరసింహారెడ్డి, రాధమ్మ, చెక్‌పోస్ట్ పీసీలు గోపాల్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.